క్లుప్తంగా

20న జిల్లా కేంద్రంలో ఒలింపిక్ ర్యాలీ

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ క్రీడా సంఘం ఆదేశానుసారం ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్పీ.వెంకటేశ్, కురుమూర్తిగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక మెయిన్ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా మీదుగా తిరిగి మైదానానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ర్యాలీలో క్రీడాసంఘాలు, సీనియర్ క్రీడాకారులు, వాకర్లు, వ్యాయామ, ఉపాధ్యాయ సంఘాలు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

21న యోగా దినోత్సవం

జడ్చర్ల టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న శనివారం ఉదయం 5 గంటలకు పట్టణంలోని మినిస్టేడియంలో యోగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు లైవాక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. వందల మందితో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేయడం అలవర్చుకొని సంపూర్ణ ఆరోగ్యం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు వైట్‌షర్ట్ వేసుకుని హాజరుకావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



జడ్చర్ల: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి అత్యధికంగా సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శివకుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మినాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



అడ్డాకుల: మూసాపేట మండలం నందిపేట పాఠశాలలో అదే గ్రామానికి చెందిన దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కొమిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ నాయకుడు పటేల్ నర్సింహారెడ్డి విద్యార్థులకు సొంత ఖర్చులతో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, కార్యదర్శి మురళీధర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాస్, ఖాదర్, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు పంచామృతాభిషేకం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు రేణుకాఎల్లమ్మ ఆలయంలో మంగళవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేయడంతోపాటు ఆలయప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకుడు రాధాకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉల్లిపాయల వేలం

దేవరకద్ర: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం 10 గంటలకు ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు. గతవారం మార్కెట్‌కు సెలవు కారణంగా వేలం జరగలేదు. ఈ వారం మార్కెట్‌కు రైతులు ఎక్కువ మొత్తంలో ఉల్లిని తెచ్చే అవకాశం ఉంది. వేలంలో స్థానిక వ్యాపారులతో పాటు బయటి వ్యాపారులు, ఇతర కొనుగోలు దారులు పాల్గొనే అవకాశం ఉంది.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నవాబ్‌పేట: ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని పోమాల్, కూచూర్‌లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పోమాల్‌లో 28, కూచూర్‌లో 15 వినతులు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమాల్లో డీటీ సువర్ణతోపాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించాలి



భట్టుపల్లిలో అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ పీడీ విద్యంభాస్కర్

- హౌసింగ్ పీడీ విద్యంభాస్కర్
- భట్టుపల్లిలో ఇళ్ల నిర్మాణం పనుల పరిశీలన
- నిర్మాణం, డబ్బుల చెల్లింపుపై పీఎస్‌లకు అవగాహన

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించాలని హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విద్యంభాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని భట్టుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను హౌసింగ్ డీఈఈ పుష్పలత, ఎంపీడీఓ ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు. భట్టుపల్లిలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణం వివిధ దశల గురించి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులకు వివరించారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణ విధానం, యాప్ ద్వారా ఇండ్ల మార్కింగ్ ముగ్గు వేసి పోయించారు. బేస్‌మెంట్ లేవెల్, శ్లాబ్ లేవల్, రూఫ్ లేవల్, యాప్‌లో క్యాప్చరింగ్ చేయు విధానం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కార్యదర్శులకు పీడీ అవగాహన కల్పించారు. యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారులకు డబ్బులు చెల్లించే విధా నం గురించి వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాంసమీర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అనుకరణ విద్యాబోధన



అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం

- స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి జరీనాబేగం

స్టేషన్ మహబూబ్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటలు, అనుకరణతో పిల్లలకు విద్యాబోధన చేస్తారని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి జరీనాబేగం అన్నారు. జిల్లా కేంద్రం క్రిస్టియన్‌కాలనీలో కమ్యూనిటీహాల్‌లో మంగళవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీడబ్ల్యూఓ మాట్లాడుతూ.. అమ్మఒడి తర్వాత మలిబడి అంగన్‌వాడీ కేంద్రాలన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లలు కోరుకునే విధంగా సంభాషణ, ఆటపాటలతో విద్యాబోధన సాగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని, త్వరలో ప్రభుత్వం నుంచి యూనిఫామ్‌లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ వలీమ్ సుల్తానా, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శ్రీపూజిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటా



మంత్రిని గజమాలతో సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

- పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటీ శ్రీహరి
- గజమాలతో సన్మానించిన ముదిరాజ్ మహాసభ నాయకులు
- పండుగ సాయన్న, అమరవీరులకు నివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముదిరాజ్‌లకు ఎల్లప్పుడు అండగా ఉంటానని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం తొలిసారిగా జిల్లాకేంద్రానికి వచ్చిన మంత్రికి ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో క్రేన్‌తో భారీ గజమాలతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వెంకటేశ్వరకాలనీలో ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఆర్ అండ్‌బీ అతిథిగృహంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన తనకు మంత్రి పదవి ఇచ్చినందుకు పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకుడు ఎన్పీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, యాదయ్య, నర్సింహ, గణేశ్, అశోక్, రాధ, రమాదేవి, చంద్రుడు, బోల యాదయ్య, నరేందర్, కృష్ణ, రాములు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రైతు భరోసాను సకాలంలో అందించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసి రైతుభరోసాతోపాటు సబ్సిడీపై అందించే వ్యవసాయ యంత్ర పరికరాలు, స్ప్రేయర్స్, టార్పాలిన్స్, రోటోవేటర్స్, కల్టివేటర్స్ అందించాలని కోరారు. సబ్సిడీపై మామిడి, జామ, నిమ్మ, కూరగాయల తోటలకు డ్రిప్ ఇరిగేషన్ ఇవ్వాలని, ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పండించే రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

క్షేత్రస్థాయిలో పార్టీ ప్రతిష్టకు కష్టపడాలి



మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలంగా తయారు చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని టీపీసీసీ పరిశీలకుడు సాంబయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టీఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీలు పూర్తిచేసుకుంటే, ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పరిశీలకుడు భాస్కర్ యాదవ్, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

గండీడ్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని యోగా ట్రైనర్ మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆయూష్ ఆధ్వర్యంలో మంగళవారం గండీడ్ యునానీ ఆస్పత్రిలో అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ప్రతిరోజూ యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, యునానీ ఆస్పత్రి డాక్టర్ శిల్ప పాల్గొన్నారు.

'ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు'

మరికల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకోవడం సిగ్గుచేటని రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి రవికుమార్ అన్నారు. మరికల్ కుర్వగేరిలో మంగళవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సడక్ యోజన, సుకన్య పథకం వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రభుత్వం వాటినే పేర్లు మార్చుకొని తమ పథకాలుగా డబ్బు కొట్టుకుంటుందని మండిపడ్డారు.

ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిర్మూలించాలి



13వ వార్డులో వంద రోజుల ప్రణాళికలో పాల్గొన్న చైర్‌పర్సన్ కోనేటి పుష్ప

జడ్చర్ల టౌన్: పర్యావరణానికి ప్రమాదంగా మారే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా నిర్మూలించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పిలుపునిచ్చారు. మంగళవారం ఒక మార్పు-అభివృద్ధికి మలుపు నినాదంతో వందరోజుల ప్రణాళికలో భాగంగా 13వ వార్డు చైతన్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కూరగాయలు, నిత్యావసర సరుకులకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా బట్ట సంచులు వెంట తీసుకువెళ్లాలన్నారు. ప్రతిచిన్న అవసరానికి ప్లాస్టిక్ కవర్లు తెచ్చుకునే అలవాటు మార్చుకోవాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో కాలనీ అంతా శుభ్రంగా ఉంటుందన్నారు. అనంతరం వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అలాగే మూడో వార్డు వెంకటేశ్వరాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను చైర్‌పర్సన్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, సతీశ్, మున్సిపల్ అధికారి అశోక్, మహిళా సంఘాల ఆర్పీలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్రం



జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రథమ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

మహబూబ్ నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్ ఆరోపించారు. నిజామాబాద్‌లో ఈనెల 21న నిర్వహించనున్న రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్‌పోస్టర్లను జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభల్లో టీయూసీఐ కార్మికుల పక్షాన భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దాసు, సహ కారదర్శులు శేఖర్, సతీశ్, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు శీను, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంటలో..

చిన్నచింతకుంట: నిజామాబాద్‌లో నిర్వహించే టీయూసీఐ మహాసభలకు కార్మికులు హాజరై విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఉంద్యాలలో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్‌గౌడ్, శ్రీహరి, రాములు, మహేందర్, కుమ్మరి మాసన్న, ఎద్దుల రాము, బాలరాజు ఉన్నారు.

బీజేపీ పాలనలోనే దేశం పదిలం



రుద్రారంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: బీజేపీ, నరేంద్రమోదీ పాలనతోనే దేశం పదిలంగా ఉంటుందని దేశ ప్రజలంతా ఒక నిర్ణయానికి వచ్చారని.. ఇక బీజేపీ ప్రభంజనం ఎవరూ ఆపలేరని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షత మండలంలోని రుద్రారంలో మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ జోరందుకుందని.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ ఖాతాలో పడటం ఖాయమన్నారు. అందుకు బీజేపీ శ్రేణులు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా గణేశ్‌చారి, మల్లేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా యాదయ్యగౌడ్, రజితశ్రీనివాస్, రమేశ్, విఠల్, కోశాధికారిగా రాఘవేందర్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రమేశ్, నియోజకవర్గం కన్వీనర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా చదువుకునే విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులకు రెండేళ్ల నుంచి బడ్జెట్ రిలీజ్ చేయక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు రానివ్వడంలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.450కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కుర్మయ్య, మనోహర్, ఫకీరప, మంజుల, నర్సింహులు, రాజు, శివలీల, భాగ్యమ్మ పాల్గొన్నారు.

పొంచి వున్న ప్రమాదం

- అడ్డాకులలో ప్రమాదకరంగా కల్వర్టు
- రక్షణగోడ నిర్మించిక కుంచించుకుపోయిన రోడ్డు
- మరింత కోతకు గురైతే వాహనాల రాకపోకలకు ఇక్కట్లు



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

అడ్డాకుల: మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వద్ద హైదరాబాద్ వైపు వాహనాలు వెళ్లే రోడ్డు పక్కనున్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కొత్తకోట వైపునుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఈ కల్వర్టు పక్కనుంచే బస్టాండ్‌కు వెళ్తాయి. అదేవిధంగా తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీలకు సర్వీస్ రోడ్డుపై నుంచి వచ్చే వాహనాలు కల్వర్టు పక్కనే ఉన్న మలుపు వద్ద మలుపు తీసుకుని వెళ్తాయి. మలుపు వద్దే కల్వర్టు దెబ్బతినడంతో రోడ్డు కూడా కుంచించుకుపోయింది. గ్రామంలోని మురుగు కాల్వల నుంచి వచ్చే మురుగు, రహదారి పక్కన నుంచి వచ్చే వరద నీళ్లు కలిసి వెళ్లడానికి ఇక్కడ పైపులను వేసి కల్వర్టు నిర్మించారు. కల్వర్టు నిర్మించినా కనీసం రక్షణ గోడను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వర్షాలకు కోతకు గురై కల్వర్టు ప్రమాదకరంగా ఏర్పడింది. వాహనదారులు కల్వర్టు వద్ద మళ్లేటప్పుడు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. అందులో పడిపోతారు. దీని గురించి గ్రామస్తులు పంచాయతీ అధికారులు, రహదారి నిర్వాహకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు వద్ద ద్విచక్రవాహనాలు, ఆటోలు బోల్తాపడిన ఘటనలు లేకపోలేదు. వర్షాకాలం సమీపించిన తరుణంలో వరద మూలంగా రోడ్డు మరింత కోతకు గురైతే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. రాత్రివేళ కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డు కనిపించక ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కల్వర్టును బాగు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెరుగైన విద్యనందించాలి



దేవరకద్ర: సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ



బల్సుపల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

దేవరకద్ర: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈవో బలరాం కోరారు. విద్యార్థులు ధారళంగా చదవడం, రాయడం రావాలని దీనికి ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. మంగళవారం పెద్దగోప్లాపూర్, బల్సుపల్లి ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో కలిసి సందర్శించారు. ప్రతివిద్యార్థికి బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించాలని ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రమేశ్, ముకుందాచారి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

దేవరకద్ర: మున్సిపాలిటీ పరిధిలోని బల్సుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు మంగళవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతి పూజల అనంతరం కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారి బాలబాలికలకు పలకలు పంపిణీ చేసి వారితో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, అంజమ్మ, నాయకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లి పచ్చని మణిహారం



రాజాపూర్: మండలంలోని మల్లేపల్లి రోడ్డుకు ఇరువైపులా ఐదేళ్ల క్రితం అప్పట్లో పల్లెప్రగతిలో భాగంగా నాటిన మొక్కలు నేడు పెద్దవై పచ్చని పందిరివలే.. స్వాగత తోరణంలా మారాయి. ఆ రోడ్డుగుండా వెళ్లే వారికి పచ్చని మణిహారంలా స్వాగతం పలుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చికబైళ్లతోపాటు భూమికి రంగేసినట్లు భూతల్లికూడా పచ్చనిపరువులా కనిపిస్తోంది.

గ్రామకంఠం కబ్జాపై పీఎస్‌లో ఫిర్యాదు

నవాబ్‌పేట: మండలంలోని కొత్తపల్లిలో గ్రామకంఠం భూమి కబ్జా చేశారని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గ్రామానికి చెందిన గ్రామకంఠం భూమిని అదే గ్రామంలో పెంటల చంద్రయ్య కబ్జా చేశాడని పంచాయతీ కార్యదర్శి సురేందర్ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ విషయంలో అధికారులను దుర్భాషలాడి వారి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు అడ్డుకున్న వ్యక్తులపై కేసు

మండలంలోని మల్లారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారుడిని అతని దాయాదులు అడ్డుకున్న ఘటనలో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. గ్రామానికి చెందిన కేశవులుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా.. అతడు సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. కాగా దీన్ని జీర్ణించుకోలేనివారు అతనితోపాటు కుటుంబ సభ్యులపై దాడి చేవారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్లారెడ్డిపల్లికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు రెవెన్యూ సదస్సు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వమించనున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించి ఏమైన తప్పులు ఉంటే సరి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు జరిగే సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.